కొనసాగుతున్న రైతుల రిలే నిరాహార దీక్షలు



ఘట్‌కేసర్: రైతు రుణమాఫీ సాధన సమితి ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అధ్యక్షుడు గౌరీశంకర్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారంతో ఎనమిదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కొండాపూర్ రైతులు బుచ్చిరెడ్డి, నర్సింగ్‌రావు, జంగారెడ్డి,యెల్లేశ్, జంగారెడ్డి దీక్ష చేపట్టగా.. శ్రీనివాస్‌గౌడ్, సురేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

'డీఆర్‌ఎస్'లో స్కేటింగ్ ఫెస్ట్



మేడ్చల్: గుండ్లపోచంపల్లిలోని డీఆర్‌ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో విద్యార్థులకు స్కేటింగ్ ఫెస్ట్ నిర్వహించారు. బుధవారం స్కూల్‌లో ప్రైమరీ ఇయర్స్ ప్రోగ్రామ్స్‌లో భాగంగా ఇంటర్నేషనల్ స్కూల్స్ నెట్ వర్కింగ్ ఫెస్ట్ 2025–26 ను నిర్వహించారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 12 పీవైపీ ఇంటర్నేషనల్ స్కూల్స్ నుంచి 225 మంది విద్యార్థులు ఫెస్ట్‌లో పాల్గొన్నారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ వేణుగోపాల్, స్పోర్ట్స్ కో– ఆర్డినేటర్ భరత్‌కుమార్, కోచ్చెస్ నూర్, దేవాన్ష్ మోహత, రతన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డును నిర్మించాలి

ఘట్‌కేసర్: పట్టణంలో నిర్మిస్తున్న రైల్వేవంతెనకు ఇరువైపుల ఉన్న రోడ్డులో ద్విచక్రవాహనాలు, కార్లు, ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగించడానికి బీటీరోడ్డు నిర్మించాలని పలువురు నాయకులు హైదరాబాద్ రోడ్డు డైవలెప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ డీఈ అరవింద్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. రోడ్డును నిర్మించి వృద్ధులు, మహిళలు, వికలాంగులు, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఎఫ్‌ఎసీఎస్ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, నగేశ్‌కుమార్‌గుప్తా, కమలాకర్, సిరాజ్ పాల్గొన్నారు.

'వరదనీటిలో నుంచే గర్భిణిని ఆస్పత్రికి తరలించిన 108'

మేడ్చల్: పురిటినొప్పులతో బాధపడుతున్న మహిళను 108 సిబ్బంది, స్థానికుల సహకారంతో అలుగుపోస్తున్న నీటిలో నుంచి స్ట్రెచర్‌పై దాటించారు. సకాలంలో ఆసుపత్రికి చేర్చడంతో ఆ మహిళ ప్రసవించింది. ప్రస్తుతం తల్లీ బిడ్డా క్షేమంగా ఉన్నారు. వివరాల్లోకి వెళితే... తూంకుంట మున్సిపాలిటీ పరిధి, మందాయిపల్లికి చెందిన నిరోష (24) అనే మహిళకు పురిటినొప్పులు రావడంతో 108కు ఫోన్ వచ్చింది. దీంతో అల్వాల్ లోకేషన్ నుంచి 108 సిబ్బంది మందాయిపల్లికి బయలుదేరారు. కాగా మార్గం మధ్యలోని దేవరయాంజాల్ చెరువు అలుగుపోసి నీరు మందాయిపల్లికి వెళ్లే రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అంబులెన్స్ ముందుకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. స్థానికుల సహకారంతో 108 సిబ్బంది గర్భిణిని స్ట్రెచర్‌పై అతికష్టంగా 108 వాహనం వరకు తరలించారు. అనంతరం 108 సిబ్బంది రాజు, విద్యాసాగర్‌లు తగిన జాగ్రత్తలు తీసుకొని మెడిసిటీ వైద్యకళాశాలకు సకాలంలో చేర్చగా నిరోష ప్రసవించింది. ప్రస్తుతం తల్లీ బిడ్డా క్షేమంగా ఉన్నారు.

డెలివరీలో మోసం.. కేసు నమోదు

పోచారం: డెలివరీలో మోసం జరిగిందని ఓ వ్యక్తి పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కొర్రెముల్‌లోని తిరుమలనగర్‌కు చెందిన కృష్ణమాచార్య (43)జూలై 12న అమెజాన్ యాప్‌లో స్యాంసంగ్ ఫోన్ ఆర్డర్ చేశాడు. బజాజ్ ఫైనాన్స్ ద్వారా ఈఎంఐ పద్ధతిలో ఫోన్‌ను కొనుగోలు చేశాడు. అదే నెల 17న డెలివరీ ఇచ్చారు. ఫోన్ ప్యాకెట్‌ను తెరిచి చూస్తే అందులో క్విక్ స్టార్ట్ గైడ్, యూఎస్‌బీ కేబుల్, సిమ్ ఎజెక్షన్ పిన్, కొన్ని పేపర్లు మాత్రమే ఉన్నాయి. కానీ ఫోన్ లేదు. ఈ విషయాన్ని అమెజాన్ సంస్థ దృష్టికి తీసుకెళ్లినా సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లంబాడీల హక్కులను పరిరక్షించాలి

పోచారం: రాష్ట్రపతి ద్రౌపదిముర్మును పోచారం మున్సిపాలిటీకి చెందిన బీజేపీ ఎస్టీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నానావత్ బిక్కునాథ్‌నాయక్ కలిసి బంజారావర్గానికి కల్పించిన రాజ్యాంగబద్ధమైన హక్కులను పరిరక్షించాలంటూ వినతిపత్రం అందజేశారు. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసి, లంబాడీ సమాజాన్ని ఎస్టీ జాబితా నుంచి మినహాయించాలని డిమాండ్ చేస్తూ.. బహిరంగ ప్రకటన చేయడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కులను రాష్ట్రపతి కాపాడతారని విశ్వసిస్తున్నట్లు చెప్పారు.

విద్యార్థుల కల నెరవేరేదెప్పుడో..?

కొత్త భవనానికి ప్రభుత్వ స్థలం కేటాయింపు ● నేటికీ ప్రారంభానికి నోచుకోని వైనం

కీసర: పేద విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వ అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నప్పటికీ దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు ఏళ్ల తరబడి అసౌకర్యాల మధ్యే తమ చదువులను కొనసాగించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

కేవలం 400 గజాల స్థలంలోనే..

పట్టణంగా మారిన దమ్మాయిగూడలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు రెండు ఒకేచోట కొనసాగుతుండటం, 2 స్కూళ్లల్లో కలిపి సుమారు 600 నుంచి 800 వరకు విద్యార్థులు తమ చదువులను కొనసాగిస్తున్నారు. కేవలం 400 గజాల స్థలంలోనే రెండు పాఠశాలలు, 800 మంది విద్యార్థుల వరకు ఉన్నారంటే పరిస్థితి ఎలా.. ? ఉందో అర్థం చేసుకోవచ్చు.

తరగతి గదుల్లోనే అసెంబ్లీ..

ఉదయం పాఠశాల ప్రారంభ సమయంలో అసెంబ్లీ (ప్రార్థన) చేయాలంటే ఒక పాఠశాల విద్యార్థులు తరగతి గదుల్లోనే ఉండి అసెంబ్లీ చేసుకోవాల్సిన పరిస్థితి. ఇక ఈ స్కూల్ ఆవరణలోనే రెండు పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించడం చేయాల్సి వస్తోంది.

శానిటేషన్ లేక ఇబ్బంది..

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సరిపడా టాయిలెట్లు కూడా లేని పరిస్థితి నెలకొంది. విద్యార్థులు క్రీడలు ఆడాలంటే ఎక్కడ ఆడాలో అర్థం కాని



దమ్మాయిగూడలోని ప్రస్తుత ప్రభుత్వ పాఠశాల

పరిస్థితి ఉంది. ఇంత ఇరుకు స్థలంలో రెండు ప్రభుత్వ పాఠశాలలు కొనసాగుతుండటంతో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, కొత్త భవనం నిర్మించాలని గతంలో పలుమార్లు విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు.

ఎకరం స్థలం కేటాయింపు..

దమ్మాయిగూడ మున్సిపాలిటీలో అన్ని వసతులతో ప్రభుత్వ స్కూల్‌ను నిర్మించేందుకు గత ప్రభుత్వ హయాంలో సుమారు ఒక ఎకరం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. పాఠశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే మల్లారెడ్డి తెలిపారు. ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోకపోవడంతో దమ్మాయిగూడలో స్కూల్ నిర్మాణం కోసం వచ్చిన నిధులు సైతం వెనక్కి వెళ్లిపోయాయి.

కొత్త ప్రభుత్వం ఏర్పడినా పనుల్లో జాప్యం

రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం దిగి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్నప్పటికీ స్కూల్ భవన నిర్మాణ పనులు మాత్రం ప్రారంభం కావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

శిలాఫలకానికి సిద్ధం.. ప్రారంభానికి ఆటంకం..

శిలాఫలకం వేసేందుకు పనులు కూడా ప్రారంభించగా సదరు స్థలంలో చేపట్టిన పనులను కొందరు వ్యక్తులు నిలిపేసినట్లు సమాచారం. దీంతో స్కూల్ భవన నిర్మాణ పనులు శంకుస్థాపన కాకుండానే నిలిచిపోయినట్లు సమాచారం.

కలెక్టర్ చొరవ తీసుకోవాలి..

స్కూల్ విషయంలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వ స్థలం విషయంలో నెలకొంటున్న వివాదాలను తొలగించి వెంటనే నిర్మాణ పనులను ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.



స్కూల్‌కోసంకేటాయించిన ప్రభుత్వ స్థలం

ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు



కేక్‌కట్ చేస్తున్న మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి

మేడ్చల్: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని మేడ్చల్‌లో బీజేపీ నేతలు ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ నేతలు కేక్‌కట్ చేసి స్వీట్లు పంచుకుని, పటాకులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మేడ్చల్, ఎల్లంపేట్ మున్సిపాలిటీల నాయకులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: ప్రధాని నరేంద్రమోదీ పుట్టినరోజును బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, బాలుయాదవ్, రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కరుణాకర్, రామోజీ, మల్లేష్‌ముదిరాజ్, గోపి పాల్గొన్నారు.



ప్రభుత్వాసుపత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు

బ్యాడ్మింటన్ పోటీలకు గీతిక ఎంపిక

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైంది. కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని గీతిక జాతీయ స్థాయిలో యానెక్స్–సన్‌రైజ్ ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నీకి ఎంపిక కాగా.. ఈనెల 21 నుంచి 28 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగే పోటీల్లో పాల్గొననుంది. ఈ మేరకు కళాశాల సెక్రటరీ టీవీరెడ్డి, డైరెక్టర్లు సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రామస్వామిరెడ్డి, పీఆర్వో రవిసుధాకర్, పీడీ వెంకటనారాయణ విద్యార్థినిని శాలువాతో సత్కరించి అభినందించారు.

ఊబకాయంపై అవగాహన

మేడ్చల్‌రూరల్: జాతీయ చిన్న పిల్లల ఊబకాయ అవగాహన మాసం సందర్భంగా ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధి ఘనాపూర్‌లోని మెడిసిటీ మెడికల్ సైన్సెస్ పిడియాట్రిక్ వైద్య విభాగం ఆధ్వర్యంలో పలు గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఊబకాయమాసంలో భాగంగా వైద్య విద్యార్థులకు పోస్టర్ ప్రదర్శన పోటీలు నిర్వహించారు. షేర్ ఇండియా ప్రెసిడెంట్ ప్రొఫెసర్ శివరామకృష్ణ, ప్రిన్సిపాల్ దేవేంద్రసింగ్, డైరెక్టర్ గీత, వైద్యులు సుదర్శన్‌రాజ్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

తెలంగాణ విమోచన దినోత్సవం

ఘట్‌కేసర్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ప్రజాపాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాజేశ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, మాజీ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జంగయ్యయాదవ్, అంజనేయులుగౌడ్, వెంకట్‌రెడ్డి, సంగీత, మల్లేష్, సాయిలు, గోపాల్‌రెడ్డి, రూప్‌సింగ్, రవిగౌడ్, శంకర్, విజయ్‌గౌడ్ పాల్గొన్నారు.

మేడ్చల్‌రూరల్ : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో ప్రజాపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ జాతీయ జెండా ఆవిష్కరించగా.. అనంతరం స్వచ్ఛత హి సేవ, బహిరంగంగా చెత్తను కాల్చడంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. అధికారులు, నాయకులు స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. అధికారులు, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కీసర: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కమిషనర్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సాయుధ పోరాటంలో పాల్గొన్న వారిని గుర్తు చేసుకుని నివాళులర్పించారు. డీఈ బాలమురళి, మేనేజర్ వెంకటేశం, కీసర పంచాయితీ కార్యదర్శి గంగన్న, చీర్యాల పంచాయతీ కార్యదర్శి నారాయణగౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నాగారం మున్సిపల్ పరిధిలో..

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా నాగారం మున్సిపాలిటీ పరిధిలో కమిషనర్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేశారు. డీఈ సంతోష్‌కుమార్, మేనేజర్ సురేష్‌రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ నాగేశ్వర్‌రావు, టౌన్‌ప్లానింగ్ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి తదితరులున్నారు.

మేడ్చల్: తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన దినోత్సవాన్ని మేడ్చల్, ఎల్లంపేట్ మున్సిపాలిటీలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలు, పార్టీ కార్యాలయాల వద్ద చౌరస్తాలో పార్టీ దిమ్మెల వద్ద జాతీయ జెండాలను ఎగురవేశారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ వజ్రేష్‌యాదవ్, సుధీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి రెండు మున్సిపాలిటీల కాంగ్రెస్ నేతలు, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

మేడ్చల్ రూరల్: గుండ్లపోచంపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. మాజీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, నాయకులు మల్లికార్జున్‌ముదిరాజ్, మోహన్‌రెడ్డి, శ్రీధర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కమిషనర్ రాజేశ్



దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకట్‌రెడ్డి



జెండా ఎగురవేస్తున్న బీజేపీ నేతలు



గిర్మాపూర్ పాఠశాలలో..



స్వచ్ఛత ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, స్థానిక నేతలు



జిల్లా గ్రంథాలయంలో

నీతి నిజాయితీగా విధులు నిర్వర్తించాలి

ప్రజాపాలన దినోత్సవంలో ప్రభుత్వ ఉద్యోగులకు కలెక్టర్ మనుచౌదరి సూచన

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు తమ వంతు సేవ అందిస్తూనే తమ గౌరవాన్ని కాపాడుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, విజయేందర్రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మను చౌదరి కలెక్టరేట్ ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలంగాణ అందరికి ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ విధి నిర్వహణలో భాగంగా ప్రజలకు తాము చేయగలిగినంత సేవలు అందించాలని కలెక్టరు సూచించారు. నీతి నిజాయితీగా తమ విధులు నిర్వహిస్తూ తమ గౌరవాన్ని కాపాడుకోవాలని తెలిపారు. అనంతరం



తెలంగాణ గీతానికి గౌరవ వందనం చేశారు. దీనికి ముందుగా జిల్లా కలెక్టరు, డీసీపీలు పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు, జిల్లా గ్రంథాలయ సంస్థ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, డీఆర్డీఓ సాంబశివరావు, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్ కుమార్, డీఈఓ విజయకుమారి, పరిపాలన అధికారి రామ్మోహన్ పాల్గొన్నారు.

లేబర్‌కార్డులను సద్వినియోగం చేసుకోండి



లేబర్‌కార్డులు అందజేస్తున్న సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: కార్మికులందరూ లేబర్‌కార్డులను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో వైఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భవన నిర్మాణం, ఇతర కార్మికులకు బుధవారం లేబర్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లేబర్‌కార్డులు గలవారు సహజ మరణానికి రూ.30 వేలు, ప్రమాదంలో మరణిస్తే రూ.6 లక్షలు, కుమార్తె వివాహానికి రూ. 30 వేల బీమా అందుతుందని వివరించారు. రాజశేఖర్‌రెడ్డి, బాలుయాదవ్, మహిపాల్‌రెడ్డి, కరుణాకర్, రామోజీ పాల్గొన్నారు.

స్త్రీలు బాగుంటేనే దేశం బాగుంటుంది

కీసర: ఇంటింటా స్త్రీలు బాగుంటేనే దేశం బాగుంటుందనే సంకల్పంతో నిర్వహించిన స్వస్థ్ నారీ – స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం కీసర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి, ఆరోగ్య కేంద్రం వైద్యురాలు మనుజలు వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో ప్రసూతి, నేత్ర, దంత, చర్మ, చెవి, ముక్కు, గొంతు, డెర్మటాలజీ, సైకియాట్రితో పాటు బీపీ, షుగర్, క్యాన్సర్, టీబీ వంటి పరీక్షలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ రమేష్‌గుప్తా, సూపర్‌వైజర్లు ప్రకాష్, ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి, వైద్యురాలు మనుజ

విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని జీఆర్‌ఎస్‌ఎస్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, విశ్వకర్మ సంఘం నాయకులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్: విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో బుధవారం జవహర్‌నగర్‌లో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ మేయర్ కావ్య హాజరై ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కొండల్‌ముదిరాజ్, నాయకులు అయ్యప్ప, రాజశేఖర్, ప్రసాద్‌గౌడ్, సాదిక్, రమేష్‌చారి, సోమాచారి, శ్రీరాములు, సుంకోజు నర్సింహచారి పాల్గొన్నారు.

సాక్షి, మేడ్చల్ జిల్లా: వెనుకబడిన తరగతుల అభివృద్ధి జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్లో 'విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం'' ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఝాన్సీ రాణి జ్యోతి



జవహర్‌నగర్‌లో ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ మేయర్ కావ్య

ప్రజ్వలన చేసి, విశ్వకర్మ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ.. విశ్వకర్మ మహర్షి దేవతల దివ్య శిల్పి, ఆయనే సృష్టికర్త, శిల్పకళా నిపుణుడు, లోక నిర్మాణకర్తగా ప్రసిద్ధి పొందారు. పురాణాల ప్రకారం.. విశ్వకర్మ దేవాలయాలు, యంత్రాలు, ఆయుధాలు, భవనాలు నిర్మించారు. విశ్వకర్మ జయంతిరోజు ముఖ్యంగా శిల్పులు, వడ్రంగులు, ఇంజినీర్లు, కార్మికులు, యంత్రాంగ నిపుణులు తమ పనిముట్లకు పూజ చేస్తారు. ఈ పండుగ కృషి, శ్రమ, సృజనాత్మకతకు ప్రతీక అని విశ్వసిస్తారు. వివిధ శాఖల జిల్లా అధికారులు సాంబశివరావు, విజయకుమారి, కాంతమ్మ, స్వర్ణలత, రాధిక, ఎల్. రామ్మోహన్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానవాటికలో మురుగు సమస్యను పరిష్కరించాలి

మేడ్చల్: పట్టణంలోని రజకుల శ్మశానవాటికలో మురుగు చేరకుండా తగిన చర్యలు తీసుకోవాలని రజకులు తహసిల్దార్ భూపాల్, మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. 7వ వార్డులో గౌడవెళ్లి రూట్‌లో ఉన్న శ్మశానవాటికలో నీరు చేరడంతో అంత్యక్రియలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తగిన చర్యలు తీసుకోవాలని



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రజకులు

కోరారు. రజకులు సుదర్శన్, నర్సింగ్‌రావు, మణికంఠ, రవి, రాజశేఖర్, భాస్కర్, వినయ్‌కుమార్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కీసర: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన ఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన రుద్రకుమార్ దాస్ (20) ప్లంబింగ్ పనిచేసుకుంటూ.. బండ్లగూడ ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్నాడు. బుధవారం యాద్గార్‌పల్లిలో మెట్టు నర్సింహ ఇంట్లో ప్లంబింగ్ పనిచేస్తుండగా.. ప్రమాదవశాత్తు మిషన్ వైరు కరెంట్‌షాక్ తగిలి అపస్మారక స్థితిలో పడిపోయాడు. వెంటనే స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రుద్రకుమార్ దాస్ (ఫైల్)

'ఎన్‌సీసీ'తో క్రమశిక్షణ

మండల విద్యాధికారి శ్రీధర్

ఘట్‌కేసర్: ఎన్‌సీసీతో విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవడుతుందని మండల విద్యాధికారి శ్రీధర్ అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికల పాఠశాలలో బుధవారం ఎన్‌సీసీ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎన్‌సీసీ బాలికల బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సీఎస్‌రావు, ప్రధానోపాధ్యాయురాలు విజయ, బాలుర పాఠశాల హెచ్‌ఎం పాపిరెడ్డి, విద్యార్థినులు పాల్గొన్నారు.